క్లుప్తంగా

చౌదరి శ్రీనివాస్‌కు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శ్రీనివాస్

గార: మండలంలోని జొన్నలపాడు గ్రామానికి చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ గాయకుడు, శ్రీశ్రీ బృందావనం నిర్వాహకుడు చౌదరి శ్రీనివాస్ నంది పురస్కారం అందుకున్నారు. గురువారం విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో తెలుగు వెలుగు ఉగాది జాతీయ పురస్కారాల మహోత్సవంలో నంది పురస్కారంను కమిటీ సభ్యులు అందజేశారు. సామాజిక సేవా రంగంలో విశిష్టమైన కృషి చేసినందుకు ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. దీంతో ఆయనకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షకులు, సభ్యులు అభినందనలు తెలిపారు.

కుల గణనపై చారిత్రాత్మక నిర్ణయం



గొలివి కరుణాకరరావు

శ్రీకాకుళం: కుల గణనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రెసిడెంట్ గొలివి కరుణాకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ జనాభా లెక్కల్లో కుల గణనను చేర్చాలనే కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం ఒక మైలురాయిగా అభివర్ణించారు. భారతదేశంలో చివరి సమగ్ర కుల గణనను బ్రిటీష్ ప్రభుత్వం 1931 సంవత్సరంలో నిర్వహించిందన్నారు. అప్పటినుంచి షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల డేటా తప్ప, జాతీయ స్థాయిలో అధికారిక కుల గణన జరగలేదన్నారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దేశంలో కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించడం హర్షణీయమని జ్యోతిబాపూలే ఆలిండియా ఓబీసీ ఉత్తరాంధ్ర జనరల్ సెక్రటరీ రౌతు శంకరరావు తెలిపారు. గతంలో జనగణనతో పాటు కుల గణన చేసేవారని, తర్వాతి కాలంలో కుల గణన తీసేశారన్నారు. దానివలన బీసీలకు ఖచ్చితమైన లెక్కలు లేకుండా పోయాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆలోచించడం గొప్ప విషయమన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని డి.మత్స్యలేశం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జెమ్స్ ఆస్పత్రి వైద్యులు గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి మెరైన్ పోలీసు శాఖ సహకరించింది. మెరైన్ డీఎస్పీ నాగేశ్వరరావు వైద్య శిబిరం ప్రారంభించారు. మత్స్యకారులు ఆరోగ్యకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కొందరిని ఉన్నత ఆరోగ్య పరీక్షల కోసం ఎంపిక చేశారు. మెరైన్ శాఖ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్స్



స్కాలర్‌షిప్స్ అందుకుంటున్న విద్యార్థులు

ఎచ్చెర్ల: స్థానిక కేజీబీవీలో పదో తరగతి చదివిన విద్యార్థిని కె.కుసుమశ్రీ, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సీహెచ్ హేమలతకు విజయనగరం మానస ట్రస్టువారు మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్ అవార్డులను గురువారం అందించారు. కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతిరాజు చేతులమీదుగా ఈ అవార్డులను అందించారు. ఈ విద్యా సంవత్సరంలో మంచి మార్కులు సాధించినందుకు విద్యార్థులకు ఈ అవార్డులను అందించినట్లు ప్రిన్సిపాల్ సుధారాణి తెలిపారు.

సాయినాథుడికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలిపురంలో ఉన్న సాయి దర్బార్‌లో షిరిడీ సాయినాథునికి ప్రత్యేక పుజలు జరిగాయి. ఆలయ అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మల ఆధ్వర్యంలో ఉదయం కాకాడ హారతి, వస్త్రాలంకరణసేవ, పుష్పాలంకరణ సేవ జరిగింది. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

గార: మండలంలో కళింగపట్నం పరిధిలోని కె.మత్స్యలేశం సాల్ట్ రోడ్డులో వేంకటేశ్వర స్వామివారి ఆలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. వైదికుల వేద మంత్రోచ్ఛారణల మధ్య ఎమ్మెల్యే గొండు శంకర్ శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో దేవాలయాలు ఉండాలని, ఆధ్యాత్మిక శక్తి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి కృషి చేసిన వారందరినీ అభినందించారు.

చతికిలబడిన అభివృద్ధి..!



జేఆర్‌పురంలో నిలిచిపోయిన నాడు-నేడు భవనాలు

- ఏడాదిగా నిలిచిన నాడు-నేడు పనులు
- అసంపూర్తిగా దర్శనమిస్తున్న పాఠశాలల భవనాలు
- తుప్పపడుతున్న నిర్మాణ సామగ్రి
- పట్టించుకోని ప్రభుత్వం



వెంకటరావుపేటలో పాఠశాలలో పునాది స్థాయిలో తుప్పపట్టిన ఇనుప గజాలు

రణస్థలం: పేద పిల్లలకు కార్పొరేట్ సౌకర్యాలతో ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. అయితే పాఠశాలలన్నీ గాడినపడుతున్న తరుణంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు అభివృద్ధి పనులను పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వం చేపట్టిన పనులను ఎక్కడక్కడే వదిలేశారు. దీంతో పాఠశాలల అభివృద్ధిలో భాగమైన అదనపు భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయి. నాయకుల తీరుతో ఆయా భవనాల సామాగ్రి తుప్పుపట్టిపోతున్నాయి. కొన్నిచోట్ల నిర్మాణ సామగ్రి, బోధన పరికరాలు గుర్తు తెలియని వ్యక్తులు కాజేసి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.

నిలిచిన నాడు – నేడు పనులు

గత ప్రభుత్వంలో 70 శాతం పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణంతో పాటు, డిజిటల్ బోర్డులు, కంప్యూటర్లు, నూతన బెంచీలు, టేబుళ్లు, తాగునీటి ప్లాంట్ల ఏర్పాటు, వంట గదుల నిర్మాణం చేపట్టారు. మిగిలిన 30 శాతం పాఠశాలల్లో రెండో విడతలో నాడు-నేడు పనులు ప్రారంభించారు. ఈలోగా ఎన్నికల కోడ్ రావడం, అధికారం మారడంతో పాఠశాలల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది. కనీసం పాఠశాలల అభివృద్ధి కోసం తీసుకొచ్చిన సామాగ్రినైనా భద్రపరిచే చర్యలు చేపట్టలేదు. దీంతో పాఠశాలల భవనాలు అసంపూర్ణంగా దర్శినమిస్తున్నాయి. వీటిలో కొన్ని భవనాల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో భవనం పెచ్చులూడిపోయి, ఇనుప గజాలు తుప్పుపట్టిపాడైపోయాయి. ఒక్క రణస్థలం మండలంలో రెండో విడత నాడు-నేడు పనుల్లో 55 పాఠశాలలు, 5 అంగన్‌వాడీ భవనాల పనులకు రూ.1.02 కోట్లు నిధులు అంచనా వేయగా, అందులో రూ.36 లక్షలు గత ప్రభుత్వంలోనే వేయడం జరిగింది. మిగతా పెండింగ్ పనుల నిధులు కూటమి ప్రభుత్వం విడుదల చేయకఎక్కడక్కడే నిలిచిపోయాయి. కొన్ని పాఠశాలలకు నిధులు విడుదలైనా కూటమి వెండర్స్‌ను నియమించుకునే ప్రక్రియలో జాప్యం జరుగుతోంది.

పనులు పూర్తి చేయాలి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాఠశాలల భవనాలు అత్యంత సుందరంగా నిర్మించారు. అలాగే అధునాతన డిజిటల్ పరికరాలతో బోధన ఎంతో బాగుండేది. ప్రసుత్తం కూటమి ప్రభుత్వంలో నాడు-నేడు రెండో విడత పనులు నిర్లక్ష్యం చేయడం వలన ఎక్కడికక్కడే నిలిపివేశారు. వెంటనే పనులు పూర్తి చేయాలి. దీనివలన రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇబ్బందులు తప్పుతాయి.

– రాయపురెడ్డి భుజంగరావు, వైస్ ఎంపీపీ, రణస్థలం

త్వరలో ప్రారంభిస్తాం

నాడు-నేడు రెండో విడత పనులకు ఇటీవల కొన్ని పాఠశాలలకు నిధులు విడుదలయ్యాయి. తొలుత కేజీబీవీలు, తదుపరి పాఠశాలల పనులు ప్రారంభిస్తాం. గతంలో కన్వీనర్‌గా ఉన్న ఉపాధ్యాయుడు ద్వారా బిల్లు వోచర్ రూపంలో పెట్టి నిధులు ఖర్చు చేసేవారు. కానీ ప్రస్తుతం స్కూల్ కమిటీ సభ్యులనే వెండర్‌గా పెట్టుకుని పెండింగ్ పనులు అంచనా వేసి పనులు పూర్తి చేయిస్తాం.

– పట్టాభిరామ్, సమగ్ర శిక్షా డీఈఈ

లఘు నాటిక ప్రదర్శన



నాటిక ప్రదర్శిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని బలగ హడ్కో కాలనీ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా ఆశాఖ గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన ఆధ్వర్యంలో 'అయ్యా నేను బడికి పోతా' అనే లఘు నాటికను గురువారం ప్రదర్శించారు. ముందుగా పిల్లలకు నీతి కథలు చెప్పడం జరిగింది. ఈ నాటికలో రైతు రామయ్య పాత్రలో భోగేల ఉమామహేశ్వరరావు, రైతు భార్య సీతమ్మగా విద్యార్థిని యామిని, రైతు కొడుకుగా విద్యార్థి ఎ.పూర్ణ, కాన్వెంట్ విద్యార్థిగా లోకేష్, టీచర్‌గా గ్రంథాలయ అధికారి ఉగ్రసేనలు అద్భుతంగా నటించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా.. మేడే వేడుకలు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ వర్కర్స్ ఆధ్వర్యంలో..



శ్రీకాకుళం న్యూకాలనీ: యూటీఎఫ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో...



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఎగురవేస్తున్న సంఘ నాయకులు

కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్మిక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ, సీపీఐ, సీపీఎం, వివిధ ప్రజా సంఘాల నాయకులు హాజరై 'మే డే' ప్రాధాన్యతను వివరించారు. కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలని, పనికితగ్గ వేతనం గిట్టుబాటు అయ్యేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా కార్మిక జెండాను ఆవిష్కరించి ర్యాలీలు చేపట్టారు. పలువురు కార్మికులను సత్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్



జి.సిగడాం: నినాదాలు చేస్తున్న కార్మికులు



ఎచ్చెర్ల క్యాంపస్: అరిణాం అక్కివలసలో...



ఎచ్చెర్ల క్యాంపస్: మేడే నిర్వహిస్తున్న సివిల్ సప్లయ్ హమాలీలు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మెడికల్ రిప్రజెంటేటివ్స్ ఆధ్వర్యంలో...



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో...



ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ గోదాం కార్మికుల ఆధ్వర్యంలో మే డే వేడుకలు



ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేం నాగార్జునా అగ్రికెం పరిశ్రమ వద్ద...

వెంకటరమేష్‌కు అవార్డు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన వీఆర్ ఎడ్యుకేర్ వ్యవస్థాపకుడు పి.వెంకటరమేష్ అకడమిక్ అడ్వైజర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకున్నారు. ఈయన చేసిన అనేక పరిశోధనలు, అధ్యాపకుల అభివృద్ధి శిబిరాలు, అకడమిక్ పబ్లిషింగ్ తదితర అంశాల్లో విద్యారంగానికి చేసిన సేవలకుగాను ఓ సంస్థ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఏప్రిల్ 30వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన విశ్వవిద్యా సమ్మేళనంలో కేంద్ర జలశక్తి మంత్రి రాజభూషణ్ చౌదరి, ఫిజీ దేశ హైకమిషన్ కౌన్సిలర్ నీలేష్‌కుమార్, ఢిల్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్‌సింగ్ బిష్ట్ చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. వీఆర్ ఎడ్యుకేర్ సంస్థ ద్వారా ఆరు రాష్ట్రాల్లోని అనేక విద్యాసంస్థలకు మార్గదర్శకత్వాన్ని అందిస్తున్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న రీసోర్స్‌పర్సన్ రాజు

ఎచ్చెర్ల: విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని రీసోర్స్ పర్సన్ డాక్టర్ పీపీఎస్ రాజు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా లావేరు శాఖ గ్రంథాలయంలో ఆరోగ్యమే మహాభాగ్యం అనే అంశంపై విద్యార్థులను ఉద్దేశించి గురువారం మాట్లాడారు. ప్రతిరోజూ ఆకుకూరలు, తాజా పండ్లను తినాలని సూచించారు. యోగా చేయడం వలన మానసిక, శారీరక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకుడు టి.వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: గ్రంథాలయాలతో విజ్ఞానం సమూపార్జించవచ్చని ప్రభుత్వ ఉపాధ్యాయురాలు టి.ఎర్రమ్మ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రిసోర్స్ పర్సన్‌గా వచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఎర్రమ్మ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం నీతి కథలు బోధించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమారరాజా, జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పీవీ భాస్కర రాజా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎంపీడీవో లాంగ్ లీవ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల రెగ్యులర్ ఎంపీడీవో సీపాన హరిహరరావు రెండు నెలల మెడికల్ లాంగ్ లీవ్ బుధవారంలో ముగిసింది. అయినా ఆయన గురువారం విధుల్లో చేరలేదు. స్థానిక మండల ప్రజాప్రతినిధితో పడకపోవడం, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి ఒత్తిడి వంటి కారణాలతో ఆయన లాంగ్ లీవ్ పెట్టారు. మరోపక్క లీవ్ పెంచుకోనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈవోపీఆర్డీ బి.మల్లేశ్వరరావు ఇన్‌చార్జి ఎంపీడీవోగా కొనసాగుతున్నారు. రెగ్యులర్ ఎంపీడీవో లేకపోవడం వలన మండల పరిషత్ ప్రగతిపై ప్రభావం పడుతోంది. అలాగే ఇక్కడికి వచ్చేందుకు సైతం ఎవరూ ఆసక్తి చూపడం లేదు. స్థానిక సంస్థల నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని స్థానిక మండల స్థాయి ప్రజాప్రతినిధి స్పష్టం చేస్తుండడం, కూటమి నాయకులు తమకు అనుకూలంగా వ్యవహరించాలని ఒత్తిడి తీసుకురావడం ప్రధాన సమస్యగా మారాయి.

బీసీ కార్పొరేషన్ రుణాలు 117 మంజూరు కాగా, లోన్లు మంజూరు చేయకుండా విడిచిపెట్టారు. మరోపక్క ఇక్కడ నుంచి బదిలీ చేయాలని ఉన్నత అధికారులను ఎంపీడీవో కోరినట్లు సమాచారం. లేదంటే లాంగ్ లీవ్ పెంచుకుంటూ పోతానని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

ఇళ్లకు పయనం



శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ)లో ఇంజినీరింగ్ రెండో ఏడాది విద్యార్థులకు సెలవులు ఇచ్చారు. జూన్ 30 వరకు సెలవులు ఉండడంతో విద్యార్థులు ఇళ్లకు పయనమయ్యారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది.

- ఎచ్చెర్ల క్యాంపస్

నరకయాతన



రణస్థలం మండలంలోని కోష్ట నుంచి వెంకటరావుపేట గ్రామం వరకు వెళ్లే రహదారిపై రాళ్లు తేలడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఇదే గ్రామానికి జేఆర్‌పురం నుంచి ఉప్పివలస మీదుగా ఉన్న రహదారి కూడా ఇంతకంటే ఘోరంగా ఉండడంతో వెంకటరావుపేట గ్రామస్తుల రహదారి బాధలు వర్ణణాతీతంగా మారాయి. తారు వేసే ప్రక్రియలో ఉన్న రోడ్డును ఇలా సగంలో వదిలేయడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- రణస్థలం

పనులు పూర్తయ్యేదెన్నడో..?



ఎచ్చెర్ల మండలంలోని ముద్దాడ పంచాయతీ అంబేద్కర్ నగర్‌లో అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. రూ.7.50 లక్షల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో ఈ భవనం పనులు ప్రారంభించారు. అయితే నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, నాయకులు నిధుల మంజూరు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

మజ్జిగ పంపిణీ



శ్రీకాకుళం కల్చరల్: మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం



శ్రీకాకుళం అర్బన్: ఉచిత మజ్జిగ శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేయడం గొప్ప విషయమని శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ గవర్నర్ కొంఖ్యాన మురళీధర్‌లు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఉచిత మజ్జిగ పంపిణీ గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించేందుకు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. వేసవిలో క్రీడాకారులు, వాకర్స్, రిటైర్డ్ ఉద్యోగులు, అన్ని వర్గాల వారు మజ్జిగ తాగడం వల్ల శరీరం చల్లబడటానికి, అధిక ఉష్ణోగ్రత నుంచి ఉపశమనం పొందడానికి ఎంతో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ మరియు స్టార్ మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఎస్.జోగినాయుడు, గుడ్ల జగ్గారావు, గోలీ ఉమామహేశ్వరరావు, గేదెల లక్ష్మి, వాసంతి, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, బీవీ రవిశంకర్, ఎస్.సంజీవరావు, గొర్లే వాసుదేవరావు, వావిలపల్లి జగన్నాథ నాయుడు, డాక్టర్ జీఎన్ రావు, ఎన్.ఉపేంద్ర, పొట్నూర్ నాగేశ్వరరావు, పట్నాన శేఖర్, ఎం.మల్లిబాబు, నందిగామ కామేశ్వరరావు, గీత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్: విశాఖకు చెందిన శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం కాకివీధిలో మజ్జిగ పంపిణీ జరిగింది. డాక్టర్ కుపిలి కీర్తి పట్నాయక్, ఆస్ట్రో న్యూమరాలజిస్టు డాక్టర్ పట్నాయక్ నారాయణ్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేశారు.

యువ రచయితల వేదిక సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యువ రచయితల వేదిక ఆధ్వర్యంలో కవి సమ్మేళనం గురువారం జరిగింది. వేదిక వ్యవస్థాపకురాలు తంగి ఎర్రమ్మ ఆధ్వర్యంలో పలువురు రచయితలు ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కవితలను చదివారు. కార్యక్రమంలో గుడిమెట్ల గోపాలకృష్ణ, బలివాడ ధనుంజయ్, పేడాడ వేదవతి, మండల గుణస్వామి, ఆనెం భాస్కరరావు, కిల్లాన శ్రీనివాసరావు, పెద్దింటి ముకుందరావు, కె.శ్రీనివాసరావు, చిన్నారావు, శ్రీనివాసులు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అసిరితల్లి ఆలయ వార్షికోత్సవం



అన్నప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో అసిరితల్లి అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని 50వ డివిజన్ పరిధిలో ఉన్న సీపన్నాయుడుపేటలో వేంచేసిన అసిరితల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. వేదపండితులు యామిజాల భరద్వాజ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ముడ్రాటలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పురోహితులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.